ప్రజలకు సర్కార్ సమాధానం చెప్పాల్సిందే
పేపర్ లీక్‌లపై ఏబీవీపీ డిమాండ్

న్యూఢిల్లీ: నీట్ పరీక్షలో అక్రమాలు, నెట్ ప్రశ్నాపత్రం లీక్ కావడం వంటి ఘటనల పట్ల ఆర్ఎస్ఎస్‌తో పాటు అనుబంధ సంఘాలు సైతం అసంతృప్తిగా ఉన్నట్టు కనిపిస్తున్నది. ఈ ఘటనలపై ఆర్ఎస్ఎస్ అనుబంధ విద్యార్థి విభాగం ఏబీవీపీ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజలు ప్రశ్నలు అడిగినప్పుడు ప్రభుత్వం కచ్చితంగా జవాబు చెప్పాల్సిందేనని ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి యజ్ఞవల్క్య శుక్ల గురువారం పేర్కొన్నారు. 'ఎన్‌టీఏలో నిర్వహణ లోపం ఉందనే అభిప్రాయం ఉంది. పలు పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు 15-20 నిమిషాలు ఆలస్యంగా ఎలా వెళ్తాయి? ఒకే కేంద్రానికి చెందిన 7-8 మంది విద్యార్థులకు 100 శాతం మార్కులు ఎలా వస్తాయి? 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు ఎలా వస్తాయి? ఎన్‌టీఏ విశ్వసనీయతపై క్వశ్చన్ మార్క్ ఉంది. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరపాలి' అని ఆయన పేర్కొన్నారు.

కర్ణాటకలో ఉండేవాళ్లు తప్పక కన్నడ నేర్చుకోవాలి
సీఎం సిద్ధరామయ్య స్పష్టీకరణ

బెంగళూరు, జూన్ 20: కర్ణాటకలో నివసించే ప్రతి ఒక్కరూ కన్నడ తప్పక నేర్చుకోవాలని ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య స్పష్టంచేశారు. ఇతరులతో మాట్లాడుతున్నప్పుడు కన్నడలో మాత్రమే మాట్లాడతామని ప్రతిజ్ఞ చేయాలని కోరారు. బెంగళూరులోని కర్ణాటక శాసనసభ పశ్చిమ ప్రవేశ ద్వారం వద్ద నాడ దేవి భువనేశ్వరి కాంస్య విగ్రహ ఏర్పాటు భూమి పూజ సందర్భంగా ఆయన ఈ విధంగా మాట్లాడారు. 'కన్నడ తప్ప ఇంకో భాష మాట్లాడనని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలి. కన్నడిగులు ఉదారవాదులు. అందుకే ఇక్కడ కన్నడ నేర్చుకోకుండానే ఇతర భాషలు మాట్లాడేవారు నివసించగలుగుతున్నారు. మనం మాతృభాషలో మాట్లాడాలి' అని అన్నారు.

కేజ్రీవాల్‌కు నిరాశ
బెయిల్‌పై స్టే విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఢిల్లీ హైకోర్టు శుక్రవారం మధ్యంతర స్టే విధించింది. ఎక్సైజ్ పాలసీకి సంబంధించి కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఈ కేసులో గురువారం కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ఆయన విడుదల కావాల్సి ఉంది. అయితే, ట్రయల్ కోర్టు ఉత్తర్వులను ఈడీ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. దీనిపై జస్టిస్ సుధీర్ కుమార్ జైన్ శుక్రవారం విచారించారు. ఈ విషయంలో పూర్తి రికార్డులను పరిశీలించాల్సి ఉన్నందున 2-3 రోజుల పాటు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్టు ప్రకటించారు.

పురుషాంగంలోనూ మైక్రోప్లాస్టిక్

న్యూఢిల్లీ: పురుషుడి వృషణాలతో పాటు వీర్యంలోనూ బయటపడ్డ మైక్రోప్లాస్టిక్ రేణువులు తాజాగా పురుషాంగంలోని కణజాలంలోనూ కనిపించాయి. గత ఆగస్టు, సెప్టెంబర్‌లో మియామీ వర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో ఈ విషయం బయటపడింది. ఆరు నమూనాలను పరిశీలించగా, ఐదు నమూనాల్లో మైక్రోప్లాస్టిక్ రేణువులను గుర్తించినట్టు పరిశోధకులు తెలిపారు. పురుషాంగం కణజాలంలో మైక్రోప్లాస్టిక్ ఉనికి కారణంగా పురుషుల్లో సంతానోత్పత్తి సమస్యలు కలుగొచ్చని పేర్కొన్నారు. అయితే, అంగస్తంభనలపై ప్రభావం ఏమేరకు ఉంటుందో తెలియాల్సి ఉన్నదని వెల్లడించారు.

12 ఏళ్లకే గ్రాడ్యుయేట్
భారత సంతతి కుర్రాడి రికార్డు

వాషింగ్టన్: సాధారణంగా 12 ఏండ్లు అంటే ఏడో తరగతో, ఎనిమిదో తరగతో చదువుతుంటారు. కానీ, భారత సంతతికి చెందిన సుబోర్ణో ఇసాక్ బరీ మాత్రం అమెరికాలో గ్రాడ్యుయేట్ అయ్యాడు. పైగా కాలేజీ విద్యార్థులకు పాఠాలు చెబుతూ ప్రపంచంలోనే అత్యంత పిన్న వయసు ప్రొఫెసర్‌గా పేరుగాంచాడు. ఈ బాలుడు వచ్చే వారం యూఎస్ హైస్కూల్ నుంచి అతి చిన్న వయసులో గ్రాడ్యుయేట్ పట్టా పొందబోతూ చరిత్రను లిఖించబోతున్నాడు. అనంతరం పూర్తి స్కాలర్‌షిప్‌తో గణితం, ఫిజిక్స్‌లో న్యూయార్క్ వర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించనున్నాడు.

నీట్ నిర్వహణలో డొల్లతనం

- పరీక్ష కేంద్రాల్లో కనిపించని సీసీ కెమెరాలు
- రక్షణ లేని స్ట్రాంగ్ రూముల్లో ప్రశ్నా పత్రాలు
- కేటాయించిన సిబ్బందికి బదులు వేరేవారు
- థర్డ్ పార్టీ పరిశీలనలో బయటపడ్డ నిర్లక్ష్యం

న్యూఢిల్లీ, జూన్ 21: పేపర్ లీక్ ఆరోపణలతో వివాదంగా మారిన నీట్ పరీక్ష నిర్వహణలో అడుగడుగునా డొల్లతనం బయటపడింది. పరీక్షల నిర్వహణలో నిబంధనలు పాటించని విషయం థర్డ్ పార్టీ జరిపిన పరిశీలనలో స్పష్టంగా వెల్లడైంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించే బాధ్యతను ఒక థర్డ్ పార్టీ సంస్థకు జాతీయ పరీక్ష సంస్థ(ఎన్‌టీఏ) అప్పగించింది. దాదాపు నాలుగు వేల కేంద్రాల్లో మే 5న నీట్ పరీక్ష జరగగా 399 కేంద్రాలను థర్డ్ పార్టీ పరిశీలకులు సందర్శించి పరీక్షల నిబంధనలు అమలవుతున్న తీరును తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను జూన్ 16న ఎన్‌టీఏకు థర్డ్ పార్టీ సంస్థ అందించింది. పరీక్షా కేంద్రాల్లో లోపాలు, నిర్లక్ష్యాన్ని ఈ నివేదిక స్పష్టంగా పేర్కొన్నది.

నిబంధనలు బేఖాతరు

నిబంధనల ప్రకారం పరీక్ష జరిగే గదిలో రెండు సీసీ కెమెరాలు ఉండాలి. ఇందుకు సంబంధించిన లైవ్ ఫీడ్ నేరుగా ఢిల్లీలోని ఎన్‌టీఏ కేంద్ర కార్యాలయంలోని సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు వెళ్లాలి. అక్కడ నిపుణుల బృందం ఈ లైవ్ ఫీడ్‌ను పర్యవేక్షించాలి. కానీ, 399 పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తే 186 కేంద్రాలు, అంటే 46 శాతం వాటిల్లో సీసీకెమెరాలు లేవని థర్డ్ పార్టీ గుర్తించింది. ప్రశ్నాపత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లకు అభ్యర్థులకు పంపిణీ చేసే వరకు సెక్యూరిటీ గార్డు ఉండాలి. కానీ, 68 కేంద్రాల్లో(16 శాతం) స్ట్రాంగ్ రూమ్‌లకు సెక్యూరిటీ గార్డు లేరని తేలింది. 83 కేంద్రాల్లో విధులకు రావాల్సిన సిబ్బంది, హాజరైన సిబ్బంది వేర్వేరుగా ఉన్నారని థర్డ్ పార్టీ పరిశీలనలో వెల్లడైంది. ఈ నివేదిక ఆధారంగా ఎన్‌టీఏ ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది చూడాల్సి ఉంది.

కేంద్రమంత్రి ప్రధాన్ రాకకు వ్యతిరేకంగా ఢిల్లీ యూనివర్సిటీలో ఏఐఎస్‌ఏ నిరసన

ప్రధాన్‌కు చేదు అనుభవం

నీట్-యూజీ, యూజీసీ-నెట్ పరీక్షల అక్రమాల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు చేదు అనుభవం ఎదురైంది. శుక్రవారం ఢిల్లీ యూనివర్సిటీలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రధాన్ ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆందోళనలు చేపట్టింది. యోగా కార్యక్రమం జరగాల్సిన ఉన్న నార్త్ క్యాంపస్‌లో నల్లజెండాలు ప్రదర్శించింది. దీంతో తన కార్యక్రమాన్ని ప్రధాన్ రద్దు చేసుకున్నారు. వేరే ముఖ్యమైన పని వల్ల ప్రధాన్ హాజరుకాలేదని యూనివర్సిటీ అధికారులు ప్రకటించగా, నిరసనలకు భయపడి రాలేదని ఏఐఎస్ఏ నేతలు పేర్కొన్నారు.

నీట్ కౌన్సెలింగ్ వాయిదాకు 'నో': సుప్రీంకోర్టు

వివాదాల్లో చిక్కుకున్న నీట్-యూజీ 2024 కౌన్సెలింగ్ ప్రక్రియను నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు మరోసారి నిరాకరించింది. జూలై 6 నుంచి జరగనున్న కౌన్సెలింగ్‌ను రెండు రోజులు నిలిపివేయాలని పిటిషన్‌దారులు కోరగా వెకేషన్ బెంచ్ శుక్రవారం తిరస్కరించింది. కౌన్సెలింగ్ అనేది తెరిచి, మూసేసే ప్రక్రియ కాదని వ్యాఖ్యానించింది. అయితే, తాను కౌన్సెలింగ్‌పై స్టే విధించమని అడగడం లేదని, నీట్‌లో అక్రమాలకు సంబంధించిన పిటిషన్లు జూలై 8న సుప్రీంకోర్టు సాధారణ ధర్మాసనం ముందుకు విచారణకు రానున్నందున జూలై 6 నుంచి జూలై 8 వరకు మాత్రమే కౌన్సెలింగ్‌ను తాత్కాలికంగా ఆపాలని పిటిషన్‌దారుల తరపున న్యాయవాది కోర్టును కోరారు. ఇందుకు ధర్మాసనం తిరస్కరించింది. జూలై 6 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని స్పష్టం చేసింది. ఈ పిటిషన్లపై స్పందనను తెలియజేయాల్సిందిగా ఎన్‌టీఏ, కేంద్రానికి రెండు వారాల గడువు ఇచ్చింది. జూన్ 23న 1,563 మందికి మరోసారి జరగనున్న పరీక్షకు సంబంధించి ఎన్‌టీఏ కొంత సమాచారాన్ని దాచిపెట్టిందని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లగా స్పందనను తెలియజేయాల్సిందిగా ఎన్‌టీఏను కోర్టు ఆదేశించింది.

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ పరీక్ష వాయిదా

- 'అనివార్య పరిస్థితుల' వల్లేనని ఎన్‌టీఏ ప్రకటన
- నీట్, నెట్ పేపర్ లీకేజీల నేపథ్యంలోనే నిర్ణయం?

న్యూఢిల్లీ, జూన్ 21: నీట్, నెట్ ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకల ఆరోపణలపై వివాదం కొనసాగుతుండగానే జాతీయ పరీక్ష సంస్థ(ఎన్‌టీఏ) మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 25 నుంచి 27 వరకు జరగాల్సిన సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ పరీక్షను వాయిదా వేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. అనివార్య పరిస్థితులు, లాజిస్టిక్ సమస్యల కారణంగా పరీక్షను వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. పరీక్ష వాయిదాకు స్పష్టమైన కారణాలను మాత్రం వెల్లడించలేదు. పరీక్షల కొత్త తేదీలను తర్వాత ప్రకటిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. సైన్స్ కోర్సుల్లో పీహెచ్‌డీ ప్రవేశాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌లకు అర్హతగా ఏడాదికి రెండుసార్లు సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ పరీక్షను నిర్వహిస్తారు. కాగా, ఎన్‌టీఏనే నిర్వహించిన నీట్-యూజీ పరీక్షలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ వివాదం కొనసాగుతుండగానే ఎన్‌టీఏనే జరిపిన యూజీసీ-నెట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడంతో పరీక్ష జరిగిన మరునాడే రద్దు చేసింది. ఈ వరుస ఘటనల నేపథ్యంలోనే సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ పరీక్షను ఎన్‌టీఏ వాయిదా వేసినట్టు తెలుస్తున్నది. పరీక్ష వాయిదాపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. ఎన్‌టీఏ.. యువతకు గాయం చేసే 'నరేంద్ర ట్రామా ఏజెన్సీ'గా మారిందని విమర్శించారు.



సోం డిస్టిలరీస్ ఫ్యాక్టరీ నుంచి విముక్తి పొందిన బాల కార్మికులు. వెట్టిచాకిరీ వల్ల చివికిపోయిన ఓ బాల కార్మికుడి వేళ్లు(ఇన్‌సెట్‌లో)

సోం డిస్టిలరీస్ యూనిట్ మూసివేత

- 59 మంది చిన్నారులతో వెట్టిచాకిరీ ఉదంతం
- మధ్యప్రదేశ్‌లో పరిశ్రమ అనుమతులు రద్దు
- భారీగా పడిపోయిన కంపెనీ షేర్ల విలువ
- తెలంగాణలోనూ 'సోం'కు అనుమతులు
- పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో రద్దు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): మధ్యప్రదేశ్‌కు చెందిన వివాదాస్పద సోం డిస్టిలరీస్ అండ్ బ్రూవరీస్ కంపెనీ మరో పెద్ద వివాదంలో చిక్కుకుని తాత్కాలిక మూసివేతకు గురైంది. బడికి వెళ్లాల్సిన చిన్నారులతో మద్యం తయారీ పరిశ్రమలో వెట్టిచాకిరీ చేయిస్తున్న ఈ సంస్థ నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్(ఎన్‌సీపీసీఆర్)కు అడ్డంగా దొరికిపోయింది. 39 మంది బాలురు, 20 మంది బాలికలకు ఎన్‌సీపీసీఆర్ విముక్తి కల్పించింది. ఎన్‌సీపీసీఆర్ అధికారులు చిన్నారుల చేతులను పరీక్షించగా.. హానికరమైన రసాయనాలు, మద్యం ముడి పదార్థాలతో చిన్నారుల అరచేతులు పూర్తిగా బొబ్బలెక్కిపోయాయి. కాలినట్టుగా గాయాలయ్యాయి. ఇవి చూసిన ఎన్‌సీపీసీఆర్ అధికారులే చలించిపోయారు. వెంటనే చిన్నారులను వైద్య పరీక్షల కోసం దవాఖానలకు తరలించారు. జువైనల్ జస్టీస్, బాండెడ్ లేబర్ చట్టాల కింద ఎన్‌సీపీసీఆర్.. సోం కంపెనీపై కేసు నమోదు చేసింది.

మూతబడ్డ ఫ్యాక్టరీ.. కుప్పకూలిన షేర్లు

చిన్నారులతో వెట్టిచాకిరీ చేయిస్తున్న ఘటన వెలుగులోకి రావడంతో రైసెన్ జిల్లాలోని డిస్టిలరీస్ పరిశ్రమ అనుమతులను తాత్కాలికంగా రద్దు చేస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో పరిశ్రమ మూతబడింది. కాగా, ఈ వ్యవహారంతో తమకు సంబంధం లేదని ఈ సంస్థ చేతులు దులుపుకునే ప్రయత్నం చేసింది. తమతో పనిచేసే అసోసియేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేసే కార్మికుల వయస్సు ధ్రువీకరణ చేయకపోవడం కాంట్రాక్టర్ తప్పని, సంబంధిత అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చింది. మధ్యప్రదేశ్‌లో సోం డిస్టిలరీస్ కంపెనీని మూసివేశారనే వార్తలతో ఈ కంపెనీ షేర్ల విలువ భారీగా పడిపోయింది. ఎల్ఎస్ఈజీ డేటా ప్రకారం.. సోం డిస్టలరీ కంపెనీ షేర్ల విలువ గురువారం ఒక్కరోజే 9% పడిపోయింది. ఈ వారంలో 15% క్షీణించింది.

తెలంగాణలో అనుమతులు..

ఆరోపణలతో రద్దు

వివాదస్పదమైన సోం డిస్టిలరీస్ సంస్థకు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ ఇటీవల అనుమతులు ఇవ్వడం రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపింది. దీంతో సోం సంస్థ ఇవ్వజూపిన కమీషన్లపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ డిమాండ్ చేశారు. ఆ సంస్థ వద్ద కాంగ్రెస్ మూడుసార్లు రూ.25 లక్షల చొప్పున విరాళాలు తీసుకున్నదని క్రిశాంక్ ఇటీవల చెప్పారు. నకిలీ మద్యం తయారు చేసి మరణాలకు కారణమయ్యిందనే ఆరోపణలు ఉన్న సంస్థకు అనుమతులు ఇవ్వడాన్ని ఆయన ఎండగట్టారు. ఈ కంపెనీ మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి రూ.575 కోట్ల మేర ఎగ్గొట్టిన వైనాన్ని వెలుగులోకి తెచ్చారు. దీంతో వెనక్కుతగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇచ్చిన అనుమతులను తాత్కాలికంగా రద్దు చేసింది.

అటల్ సేతుపై పగుళ్లు!

మహారాష్ట్రలో ప్రధాని మోదీ ప్రారంభించిన అటల్ సేతుపై 3 నెలలకే పగుళ్లు వచ్చాయి. అరేబియా సముద్రంపై నిర్మించిన ఈ వంతెన దక్షిణ ముంబై -నవీ ముంబైను కలుపుతుంది. నాసిరకం నిర్మాణం, అవినీతి వల్లే పగుళ్లు ఏర్పడ్డాయని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానాపటోలే ఆరోపించారు. అయితే, పగుళ్ల వచ్చింది వంతెనపై కాదని.. వంతెనకు అనుబంధంగా ఉన్న అప్రోచ్ రోడ్డలోనని అధికారులు చెప్పారు.

అమెరికాలో పట్టభద్రులైతే గ్రీన్‌కార్డు!
విదేశీ విద్యార్థులకు ట్రంప్ ఆఫర్

న్యూయార్క్, జూన్ 21: మరోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలస విధానంపై ఆశ్చర్యకరమైన వ్యాఖ్యలు చేశారు. తాను మళ్లీ ఎన్నికైతే.. అమెరికా కాలేజీల్లో పట్టభద్రులయ్యే విదేశీ విద్యార్థులకు వెంటనే గ్రీన్ కార్డులు ఇస్తానని హామీ ఇచ్చారు. భారత్, చైనా వంటి దేశాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు తమ స్వదేశాలకు వెళ్లకుండా నివారించేందుకు వారికి శాశ్వత నివాసం కల్పించే గ్రీన్‌కార్డులను జారీ చేస్తామని చెప్పారు. అమెరికాలో విద్యనభ్యసించిన విదేశీ విద్యార్థులు తమ స్వదేశాలకు వెళ్లి కోటీశ్వరులవుతున్నారని అన్నారు. వచ్చే నవంబర్‌లో అధ్యక్ష ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో వలసలపై ట్రంప్ వైఖరిలో మార్పురావడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కాలేజీలో గ్రాడ్యుయేట్ అయిన ప్రతి విద్యార్థికి డిప్లొమా సర్టిఫికెట్‌తో పాటు గ్రీన్‌కార్డు కూడా జారీ చేయాలని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నిబంధన జూనియర్ కాలేజీలకు వర్తిస్తుందని అన్నారు. ప్రస్తుతం అమెరికా ఎన్నికల్లో వలసల అంశం కీలకంగా మారింది.

కాల్చి చంపి.. బహిరంగంగా ఉరి
ఖురాన్‌ను అవమానించాడని పాక్‌లో దారుణం

పెషావర్: ముస్లింలకు పవిత్రమైన ఖురాన్‌ను అవమానించి, దానిని అపవిత్రం చేశాడని ఆరోపిస్తూ ఒక టూరిస్టుపై పాకిస్థాన్‌లో ఒక అల్లరి మూక దారుణానికి ఒడిగట్టింది. వేలాది మంది పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి నిప్పంటించడంతో పాటు, లాకప్‌లో ఉన్న ఆ టూరిస్టును కాల్చి చంపారు. అనంతరం అతడి శవాన్ని ఈడ్చుకుంటూ వచ్చి బహిరంగంగా ఉరితీసి వేలాడదీసిన ఘటన స్వాట్ పట్టణంలో చోటుచేసుకుంది. సియోల్‌కోట్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ స్వాట్ జిల్లా పర్యటనలో ఖురాన్‌లోని పేజీలను దగ్ధం చేశాడు. దీంతో అతడిని పోలీసులు అరెస్ట్ చేసి లాకప్‌లో ఉంచారు. ఇస్మాయిల్ దుశ్చర్యపై లౌడ్ స్పీకర్ల ద్వారా బహిరంగంగా ప్రకటించడంతో వేలాది మంది పోలీస్ స్టేషన్‌కు చేరుకొని అతడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రజలు రెచ్చిపోవడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో 8 మంది గాయపడ్డారు. దీంతో మరింత ఆగ్రహం చెందిన అల్లరి మూక పోలీస్ స్టేషన్‌కు నిప్పంటించారు. లాకప్‌లో ఉన్న ఇస్మాయిల్‌ను కాల్చి చంపి, అతని మృతదేహాన్ని ఈడ్చుకుంటూ వచ్చి బహిరంగంగా ఉరితీసి వేలాడదీసింది.

పరీక్షల్లో అక్రమాలకు పదేండ్ల జైలు

- రూ. కోటి వరకూ జరిమానా
- పేపర్ లీకుల నేపథ్యంలో చట్టాన్ని నోటిపై చేసిన కేంద్రం
- ఈ నెల 21 నుంచే అమల్లోకి

న్యూఢిల్లీ, జూన్ 21: నీట్, యూజీసీ నెట్ పేపర్ లీకులపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తిన నేపథ్యంలో, పరీక్షల్లో అక్రమాల కట్టడికి ఉద్దేశించిన చట్టాన్ని కేంద్రప్రభుత్వం శుక్రవారం నోటిపై చేసింది. ప్రభుత్వ పరీక్షల (అక్రమాల నిరోధక) చట్టం-2024కి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాలుగు నెలల కిందటే ఆమోదముద్ర వేయగా, కేంద్రం తాజాగా చట్ట నిబంధనలను నోటిపై చేసింది. ఈ నెల 21 నుంచే ఈ చట్టం అమల్లోకి రానున్నది. దీని ప్రకారం పోటీ పరీక్షల్లో అక్రమాలు పాల్పడితే గరిష్ఠంగా పదేండ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. అలాగే రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉన్నది. నెట్, యూజీసీ పేపర్ లీకుల నేపథ్యంలో ఈ చట్టాన్ని నోటిపై చేయడం ప్రాధాన్యం సంతరించుకున్నది. ఈ చట్టాన్ని ఎప్పుడు అమలు చేస్తారని కేంద్ర విద్యాశాఖ మంత్రిని ప్రశ్నించిన మరుసటి రోజే దీనిపై నోటిఫికేషన్ వెలువడటం గమనార్హం. న్యాయశాఖ నిబంధనలు రూపొందిస్తున్నట్టు కేంద్ర మంత్రి గురువారం పేర్కొన్నారు. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు-2024ను లోక్‌సభ ఫిబ్రవరి 6న ఆమోదించగా, 9న రాజ్యసభ ఆమోదించింది. అదే నెల 12న రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. యూపీఎస్సీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, రైల్వేస్, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్స్, ఎన్టీఏ నిర్వహించే పరీక్షల్లో అక్రమాలను నిరోధించేందుకు ఈ చట్టాన్ని తీసుకొచ్చారు.

'వ్యక్తిగతం, సమాజం కోసం యోగ' ఇతివృత్తంతో ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం దేశ, విదేశాల్లో ఘనంగా జరిగింది. ప్రధాని మోదీ కశ్మీర్‌లోని దాల్ సరస్సు వద్ద జరిగిన కార్యక్రమంలో, సీజేఐ చంద్రచూడ్ ఢిల్లీలోని సుప్రీంకోర్టులో జరిగిన కార్యక్రమంలో ఇలా యోగాసనాలు వేశారు.

నాకు ఓటేయలేదు కదూ..
మీకు గడ్డు రోజులే
నికోబార్ ఓటర్లకు బీజేపీ ఎంపీ హెచ్చరిక

న్యూఢిల్లీ: 'యాదవులు, ముస్లింలు నాకు ఓటేయలేదు. వారి కోసం పని చేయను' అంటూ జేడీయూ ఎంపీ దేవేశ్ చంద్ర ఠాకూర్ ఇటీవలి వ్యాఖ్యలు వివాదాస్పదంగా కాగా, తాజాగా అండమాన్ నికోబార్ బీజేపీ ఎంపీ బిష్ణుపాద రాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. నికోబార్ ప్రజలు తనకు ఓటేయలేదని, వారికి గడ్డురోజులు మొదలైనట్టేనని రాయ్ బెదిరింపులకు దిగారు. లోక్‌సభ ఎన్నికలు ఓట్ల లెక్కింపు జరిగిన మరునాడు ఎంపీ ఈ వ్యాఖ్యలు చేయగా, ఇందుకు సంబంధించిన వీడియో తాజా వైరల్ అయ్యింది. 'నికోబార్ పేరుతో మీరు డబ్బులు తీసుకుంటారు. మందు తాగుతారు. ఓట్లు మాత్రం వేయరు. జాగ్రత్త.. మీకు గడ్డురోజులు ప్రారంభమైనట్టే. మీ భవిష్యత్తు ఎంతమాత్రం ఆశాజనకంగా ఉండదు' అంటూ ఆయన ఓటర్లను హెచ్చరించారు.

'ఐఏఎస్ సింధూరి నా భూమిని ఆక్రమించారు'

బెంగళూరు: కర్ణాటక క్యాడర్‌కు చెందిన తెలుగు ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి తన భూమిని ఆక్రమించారంటూ ప్రముఖ బాలీవుడ్ గాయకుడు లక్కీ అలీ కర్ణాటక లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. యెలహంకలోని తన వ్యవసాయ భూమిని సింధూరి, ఆమె భర్త సుధీర్ రెడ్డి, బంధువు మధుసూధన్ రెడ్డి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దీనిపై 2022లోనే తాను ఫిర్యాదు చేసినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో లోకాయుక్తను ఆశ్రయించినట్టు చెప్పారు.

ఆర్నెల్లలో లక్ష మందిపై వేటు!

- ఐటీ రంగంలో కొనసాగుతున్న కొలువుల కోత
- 2024 తొలి అర్ధ భాగంలో భారీగా తొలగింపులు
- పెరుగుతున్న సైలెంట్ లేఆఫ్‌లు.. టెకీల్లో బుగులు

న్యూఢిల్లీ: ఐటీ రంగంలో ఉద్యోగాల ఊచకోత కొనసాగుతున్నది. స్టార్టప్‌లు మొదలుకొని దిగ్గజ కంపెనీల వరకూ భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో దాదాపు లక్షమంది టెకీలు ఉద్యోగాలు కోల్పోయినట్టు నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2022లో మొదలైన తొలగింపుల పర్వానికి అడ్డుకట్ట పడటం లేదు. అమెజాన్, ఆల్ఫాబెట్, మైక్రోసాఫ్ట్, మెటా తదితర బడా కంపెనీలు కూడా భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఆర్థిక మందగమనం, కొవిడ్ సమయంలో భారీ సంఖ్యలో ఉద్యోగులను నియమించుకోవడం, కొవిడ్ తర్వాత డిమాండ్ తగ్గడం, ఖర్చుల తగ్గింపులో భాగంగా పునర్వ్యవస్థీకరణ చేపడుతుండటం.. ఉద్యోగాల కోతకు ప్రధాన కారణం. 2022లో 1,064 కంపెనీలు సుమారు 1.64 లక్షల మంది ఉద్యోగులను తొలగించాయి. ఆ మరుసటి ఏడాది లేఫ్‌లు మరింత పెరిగాయి. 2023లో 1,175 కంపెనీలు 2.6 లక్షల మంది ఉద్యోగులపై వేటు వేశాయి. 2022తో పోలిస్తే ఇది 58 శాతం అధికం. కొన్ని నెలలుగా ఐటీ రంగంలో ఉద్యోగాల కోత కొనసాగుతున్నప్పటికీ, 2024లో కూడా లేఆఫ్స్‌కు అడ్డుకట్ట పడే సంకేతాలు కనిపించడం లేదు.

ఏడాది	ఉద్యోగాలు కోల్పోయినవారు
2022	1,64,969
2023	2,60,509
2024 (తొలి ఆర్నెల్లు)	98,834

సైలెంట్ లేఫ్‌ల ట్రెండ్

ఎప్పుడు ఉద్యోగం పోతుందో తెలియక ఇప్పటికే టెకీలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్న వేళ సైలెంట్ లేఆఫ్ ట్రెండ్ వారిలో మరింత బుగులు పుట్టిస్తున్నది. చాలా కంపెనీలు బయటకు ప్రకటించకుండానే సైలెంట్‌గా ఉద్యోగులను తొలగిస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. గత ఏడాది సుమారు 20 వేల మంది టెకీలు ఇలా ఉద్యోగాలు కోల్పోయారని ఆలిండియా ఐటీ, ఐటీ ఎనేబుల్డ్ సర్వీసెస్ ఎంప్లాయీస్ యూనియన్ వెల్లడించింది. వాస్తవానికి ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండొచ్చని పేర్కొన్నది. ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో 2 వేల నుంచి 3 వేల మందిని భారత ఐటీ కంపెనీలు సైలెంట